క్లుప్తంగా

పాదగయ క్షేత్రంలో విశేష పూజలు



కుక్కుటేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పాదగయ క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. కాకినాడ జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తున్నారు. కార్తిక మాసోత్సవాల్లో భాగంగా పాదగయ పుణ్యక్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం పండితులు స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేయగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పాదగయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కార్తిక దీపాలు వదిలారు.

చట్టాలతో మహిళలకు రక్షణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ కృష్ణ భగవాన్

సామర్లకోట: మహిళా రక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సీఐ ఎ.కృష్ణ భగవాన్ పిలుపునిచ్చారు. వీకే రాయపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలను వేధించడం, బాల్య వివాహం చేయడం, గృహహింస, వరకట్నం వంటి వేధింపులపై చట్టాలు మహిళలకు రక్షణగా ఉంటాయని చెప్పారు. మహిళలు ఫిర్యాదు చేస్తే వెంటనే వారిపై విచారణ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళపై మర్యాదగా వ్యవహరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

పంచారామ క్షేత్రంలో ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ మెంబర్



స్వామి వారి ఫొటో అందజేసిన ఈఓ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ మెంబర్ ముప్వ పద్మ బుధవారం రాత్రి ఆలయంను సందర్శించారు. ఈ సందర్భగా ఈఓ భళ్ల నీలకంఠం, ఉత్సవాల ప్రత్యేకాధికారి కేవీ సూర్యనారాయణల ఆధ్వర్యంలో ఆలయ పండితులు స్వాగతం పలికారు. స్వామివారికి, అమ్మవారి పూజలు చేసిన అనంతరం ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈఓ స్వామి వారి ప్రసాదం, ఫొటోను అందజేశారు.

భీమేశ్వరునికి లక్ష బిల్వార్చన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో వేంచేసి ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామభీమేశ్వరస్వామి వారికి బుధవారం సాయంత్రం లక్ష బిల్వార్చన నిర్వహించారు. కార్తిక మాసం స్వామివారి ఆరుద్ర నక్షత్ర పూజలు మంగళవారం అత్యంత వైభవంగా జరగడంతో మరుసటి రోజు లక్ష బిల్వార్చన నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామి వారికి ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్ శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినత్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు అంజిబాబులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



సామర్లకోట పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం భీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన అందరినీ ఆకట్టుకుంది. ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకునే భక్తులు దేవస్థానానికి రుసుం చెల్లించాలి. ఈ లక్షపత్రి పూజలు పాల్గొనే భక్తులు ఆలయ దీపారాధన సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన పాల్గొని దీపాలను వెలిగించారు.

జంక్షన్.. టెన్షన్

- సామర్లకోట–ప్రత్తిపాడు రహదారిలో నిత్యం ట్రాఫిక్ జామ్
- దివిలి జంక్షన్‌లో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- గంటల తరబడి స్తంభిస్తున్న వాహనాలు
- కలగా మిగిలిన రోడ్డు విస్తరణ పనులు

పెద్దాపురం: సమయానికి గమ్యాన్ని చేరుకోవడానికి సరైన రవాణా సదుపాయం ఉండాలి. పెరుగుతున్న జనాభా, ఇరుకు రోడ్ల వల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సామర్లకోట–ప్రత్తిపాడు రహదారిలోని దివిలి జంక్షన్‌లో ప్రతిరోజు ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళలో ట్రాఫిక్ మరింత ఎక్కువగా ఉంటోంది.

విద్య, వ్యాపారపరంగా అభివృద్ధి చెందిన పెద్దాపురం మండలం దివిలి, చంద్రమాంపల్లి గ్రామాల ప్రధాన రహదారి తరచూ ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటుంది. ఉదయాన్నే పాఠశాల, కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు, ఉద్యోగులు, మెట్ట ప్రాంతంలోని ప్రధాన రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధులు, పాలకుల వాహనాలు ఇదే జంక్షన్ నుంచి వెళుతుంటాయి. అయినా ఏళ్ల తరబడిగా ఉన్న ట్రాఫిక్ సమస్యను పట్టించుకునే నాథులే కరువయ్యారు. రహదారి విస్తరణకు గాను గత పాలకులు ప్రణాళికబద్ధంగా రోడ్డు విస్తరణ పనులు చేపడతామని హామీ ఇచ్చినా అది కాస్త అటకెక్కించారు. అటు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కాక, ఇటు ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్డు విస్తరణకు మార్జిన్లు ఇచ్చినప్పటికీ..

రోడ్డు విస్తరణ పనుల కోసం ఆయా దుకాణాల తొలగింపు మార్జిన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ అధికార యంత్రాంగం, గత పాలకుల తీరు »ఎక్కడ వేసిన గొంగళి అక్కడే« అన్న చందంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారని ప్రజలు సంబరపడిన రెండు రోజులకే అభివృద్ధి పనులు ఆగిపోవడంతో ప్రజలు అవాక్కయ్యారు. గత మూడేళ్లుగా విస్తరణ పనులు చేపడతారని ఆశ అడియాశ కావడంతో ఇకపై ట్రాఫిక్ ఇబ్బందులు తప్పవంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలతోనే ట్రాఫిక్

అసలు కన్నా కొసరు మిన్న అన్నట్టుగా తయారైంది చంద్రమాంపల్లి గ్రామ వ్యాపారుల దుస్థితి. రోడ్డు విస్తరణ పనుల్లో అవసరమైన మార్జిన్ మేరకు దుకాణాలు తొలగించకపోయినా ఆయా దుకాణాల వద్ద ఎదురుగా అద్దెలకు వేరే దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఇటీవల ఆయా ఆక్రమణ దుకాణాలను ఎత్తివేసేందుకు గత ఆర్డీవో, సీఐలకు ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ ఆచరణ కాకపోవడంతో ఆక్రమణ దుకాణాల కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు, పాలకులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



దివిలిలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో రాత్రివేళ నిలిచిపోయిన వాహనాలు

హామీ తప్ప ఆచరణ శూన్యం



దివిలి ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టతామన్న 2019లో అప్పటి మాజీ మంత్రి, ప్రస్తుత శాసనసభ్యుల హామీ ఆచరణకు నోచుకోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దుకాణదారులను వెనక్కి జరిగేలా పోలీస్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అదికాస్త నెల రోజులు గడువకుండానే రోడ్లపైకి దకాణాలు చేరాయి. దాదాపు రెండున్నరేళ్ల నుంచి ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప అభివృద్ధి పనులు చేపట్టక నిత్యం ట్రాఫిక్ సమస్యల జఠిలమవుతోంది. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.

–వట్టికూటి రాజ్‌కుమార్, నిరుద్యోగి, దివిలి, పెద్దాపురం మండలం

సిబ్బందిని నియమిస్తాం



దివిలి జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని నియమిస్తాం. ప్రతి రోజూ ట్రాఫిక్ పోలీసును ఏర్పాటు చేసి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. విస్తరణ పనులకు మిగిలిన శాఖాధికారులు ముందుకు వస్తే ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

–వి.మౌనిక, ఎస్‌ఐ, పెద్దాపురం

కాకినాడ రోడ్డులో ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 వాహనం

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో బుధవారం ట్రాఫిక్ స్తంభించింది. సామర్లకోట–కాకినాడ రోడ్డులోని మాధవపట్నం వద్ద సర్పవరం వెళ్లే మార్గంలో రైల్వే గేటు వేయడంతో వాహనాలు రోడ్డుపై బారాయి. రైల్వే గేటు తీసిన వెంటనే గేటు మీదుగా వాహనాలు రాకపోకలు చేయడంతో సామర్లకోట–కాకినాడ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోయింది. దాంతో సామర్లకోట నుంచి కాకినాడ వెళుతున్న 108 వాహనం కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుంది. సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం వివిధ కళాశాలకు వెళ్లే విద్యార్థులు, వివిధ సంస్థలకు వెళ్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకూ ఈ ట్రాఫిక్ సమస్య ఉంటున్న పోలీసు సిబ్బంది స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మాధవపట్నం వద్ద బారులు తీరిన వాహనాలు

మార్చి 31 లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

హౌసింగ్ పీడీ సత్యనారాయణ

సామర్లకోట: ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు మార్చి 31వ తేదీ లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఈటీసీ జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లేఅవుట్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లను, నిర్మాణం జరుగుతున్న ఇళ్లను, ఖాళీ స్థలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదల కోసం ప్రభుత్వం స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించుకునేందుకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారికి బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అద్దెలకు చెల్లించే మొత్తం బ్యాంకులకు వాయిదాలుగా చెల్లించి సొంత ఇంటి కల నెరవేర్చుకొవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేక పోతే కారణాలను లిఖిత పూర్వకంగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ వై శ్రీనివాసరావు, డీఈ బి.సువర్ణరాజు, ఏఈ ఐవీవీ ఎస్.సురేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, టీపీఓ మంజుల తదితరులు పాల్గొన్నారు.



ఈటీసీ జగనన్న లేఅవుట్‌లో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ సత్యనారాయణ

ఉప్పాడ తీరంలో సాగర్ కవచ్

కొత్తపల్లి: ఆహ్లాదకర వాతావరణం, కెరటాల కేరింతలతో ప్రశాంతంగా ఉండే ఉప్పాడ సాగర తీరం పోలీసుల సైరన్‌లతో ఒక్కసారిగా ఉలిక్కి పడింది. తీరా చూస్తే పోలీసులు నిర్వహిస్తున్న మాక్‌డ్రిల్ అని తెలుసుకుని మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం ఉప్పాడ తీరంలో పోలీసులు మాక్‌డ్రిల్ (సాగర్ కవచ్) నిర్వహించారు. ఉప్పాడ శివారు ఎస్పీజీయల్ నుంచి పొన్నాడ శివారు కోనపాపపేట వరకూ తీరప్రాంతాన్ని పోలీసులు జల్లెడ పట్టారు. కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలుకు చెందిన సుమారు 36 మంది పోలీసులు గస్తీ నిర్వహించారు. 2 రోజుల పాటు ఈ మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉగ్రవాదులు తీరప్రాంతానికి చేరుకునే సమయంలో వారిని గుర్తించి పట్టుకోవడంపై అవగాహన కల్పించారు. సముద్రం, తీరప్రాంతంలో అనుమానిత వ్యక్తులు బోట్లలో సంచరించినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని మత్స్యకారులను కోరారు.



ఉప్పాడ తీరంలో సాగర్ కవచ్ నిర్వహిస్తున్న పోలీసులు

వైభవంగా శివస్వాముల గ్రామోత్సవం



దుర్గాడలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న శివ స్వాములు



పాదగయ క్షేత్రంలో బారులు తీరిన శివభక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ బుధవారం శివనామస్మరణతో మార్మోగింది. దుర్గాడకు చెందిన శివస్వాములు, అయ్యప్ప, దత్త స్వాములు బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. శరీరం నిండా విభూది ధరించి శివ నాట్యం చేస్తూ పార్థివ శివలింగాన్ని ప్రత్యేక రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో అడుగడుగునా భక్తులు స్వామివారి రథానికి స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలువురు శివ స్వాములు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

పిఠాపురం: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా గ్రామాల్లో శివ భక్తుల సందడి నెలకొంది. ఆలయాల్లో ప్రత్యేక శివలింగాల వద్ద ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహిస్తున్నారు. శివ భక్తులు ఎక్కువగా అభిషేకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి వారి సన్నిధిలో ప్రతిరోజూ వందలాది మంది శివదీక్షాపరులు స్వామి వారి దర్శనానికి బారులు తీరుతున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నారు. బుధవారం జిల్లా నలుమూలల నుంచి శివభక్తులు తరలివచ్చి కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కొందరు ఆలయంలో శివ దీక్షలు స్వీకరించారు. ఎక్కువ మంది శివ భక్తులు ఆలయంలోనే ఉంటూ దీక్షలు కొనసాగిస్తున్నారు.

ఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడిగా సీతారామస్వామి



నూతనంగా ఎన్నికైన ఏపీ ఎన్‌జీఓ కమిటీ ఇదే..

సామర్లకోట: ఏపీ ఎన్‌జీఓ మండల శాఖ అధ్యక్షునిగా ఎం.సీతారామస్వామి(సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం) ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. బుధవారం సాయంత్రం జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామమోహనరావు ఆదేశాల మేరకు స్థానిక సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా వైటీ రామారావు (సీహెచ్‌సీ, సామర్లకోట) ఉపాధ్యక్షులుగా ఆర్.జమీన కుమారి(పీహెచ్‌సీ వేట్లపాలెం), టీ సత్యనారాయణ(మాధవపట్నం సెక్రటరీ) పి.చరణ్‌కుమార్ (సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం), కార్యదర్శిగా ఎం.శ్రీనివాసు(పీహెచ్‌సీ వేట్లపాలెం), సహాయ కార్యదర్శులు బి.దుర్గాప్రసాద్ (తహసీల్దార్ కార్యాలయం) పీవీఎస్ శ్రీనివాసు(మున్సి పాలిటీ) బీ అనిల్‌కుమార్ (ఆర్‌అండ్‌బీ) మహిళా సహాయ కార్యదర్శిగా డి రామ కుమారి (పీహెచ్‌సీ వేట్లపాలెం), కోశాధికారిగా ఎ.జేజేశ్వరరావు(సబ్ రిజిస్టార్ కార్యాలయం, సామర్లకోట) ఎన్నిక అయ్యారు. ఎన్నిక ప్రక్రియను జిల్లా ఉపాధ్యక్షుడు కూడిపూడి ప్రసాద్ పర్యవేక్షించారు. జిల్లా కమిటీ ప్రతినిధులు నూతన కమిటీని అభినందించారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు

సామర్లకోట: గిరిజన ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు సాంకేతికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికలు తయారు చేయాలని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులతో బుధవారం స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సామాజికంగా గిరిజనుల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను గుర్తించాలన్నారు. ఈ మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో భూమి వివరాలను గుర్తించి, ఆయా భూముల అభివృద్ధికి చిన్ననీటి వనరుల ప్రణాళికలు, నిధుల అవసరాలను తెలుసుకోవాలన్నారు. మైనింగ్ లీజు మంజూరుకు తప్పనిసరిగా సిఫార్సులు ఉండాలని తెలిపారు. దళారుల నుంచి వడ్డీ వ్యాపారంపై నియంత్రణ విధించి ప్రభుత్వ బ్యాంకుల నుంచి రుణాలు అందజేసే ఏర్పాట్లు చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో జాతీయ ఆర్థిక విధానం అమలుతో ఆరోగ్యం, పారిశుధ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఇక్కడి ప్రజల అవసరాలను గుర్తించి వారికి మెరుగైన సదుపాయాలు అందజేయడానికే సమీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు జీవీ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వేణుగోపాల్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి కొత్త లైను ఏర్పాటు కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనులు కారణంగా బ్రౌన్‌పేట, కోటపేట, కుమ్మరవీధి, పాత తహసీల్దార్ కార్యాలయం, పెద్ద బజార్, బలుసులపేట, సంత మార్కెట్, పెన్షన్‌లైన్, సామాజిక ఆరోగ్య కేంద్రం, ఇందిరా కాలనీ, నీలమ్మ చెరువు, ఇస్మాయిల్ నగర్, సంగీతరావుపేట, మెహర్‌కాంప్లెక్స్, హెడ్ పోస్టుఫీసుల పరిధిలో విద్యుత్‌ను నిలిపివేయనున్నట్టు తెలిపారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

- మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య
- స్థలం కేటాయించాలని వినతి

సామర్లకోట: గ్రంథాలయాలతో ప్రజలకు విజ్ఞానం లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు ముగింపును పురస్కరించుకొని స్థానిక గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయాధికారి బందిల రత్నమణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యువత గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలన్నారు. అనేక మంది గ్రంథాలయాలలోని పుస్తకాలను చదువుకోవడం ద్వారా ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. అటువంటి సామర్లకోట గ్రంథాలయం రెండో అంతస్తు అద్దె భవనంలో ఉండడం బాధాకరమని అన్నారు. పాఠకుల నుంచి వస్తున్న వినతుల మేరకు కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకొని మున్సిపాలిటీ నుంచి స్థలం కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు. ఈ మేరకు పాఠకులు గ్రంథాలయానికి స్థలం కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. కాపు కల్యాణ మండపం సమీపంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక భాగంలో గతంలో ఎలిమెంటరీ పాఠశాల ఉండేదని, ఆ స్థలం కేటాయించాలని మానవ హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ సూచించారు. అనంతరం గ్రంథాలయాల విశిష్టతను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, హైస్కూల్ హెచ్‌ఎంలు యు సత్యనారాయణ, తాండ్ర శ్యామ్‌సుందర్ వివరించారు. గ్రంథాలయాల విద్యార్థుల మేదస్సును పెంచడానికి దోహదపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలోని గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాలు బుధవారం ముగిశాయి. వివిధ పోటీల్లో విజేతకు గ్రంథాధాలయాధికారి సి.మణికుమారి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి వై.శ్రీహరి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

గ్రంథాలయాలతో నిరంతర జ్ఞాన సముపార్జన

పెద్దాపురం: ప్రతి వ్యక్తికి నిరంతర జ్ఞానసముపార్జన అవసరమని, దీనికై గ్రంథాలయాల్లోని పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి, డీఎస్పీ శ్రీహరిరాజు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ బుధవారం గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ, డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో నిరంతరం జ్ఞానసముపార్జన ఉండాలన్నారు. పుస్తకాలు చదివినప్పుడే అవి సాధ్యపడుతుందన్నారు. మంచి పుస్తకం కొనుక్కుంటే అది మంచి ఆస్తి అని, తద్వార తరగని జ్ఞాన సముపార్జన చేయవచ్చన్నారు. అనంతరం గత వారం రోజులుగా నిర్వహించిన వక్తృత్వ, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల విజేతలకు వారి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చే శారు. ఈ కార్యక్రమంలో జ్యోసుల కృష్ణబాబు, శివజ్యోతి, భళ్ల మూడి మూర్తి పాల్గొన్నారు.

జ్ఞాన సాధనకు సోపానాలు గ్రంథాలయాలు

పిఠాపురం: గ్రంథాలయాలు జ్ఞాన సాధనకు సోపానాలు అని పిఠాపురం ఉప విద్యాశాఖ అధికారి ఇ.ప్రభాకర్ శర్మ అన్నారు. పిఠాపురంలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని, విద్యార్థులు బాల్యం నుంచే గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో తరగతి పుస్తకాలు మాత్రమే ఉంటాయని, గ్రంథాలయాల్లో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి విద్యార్థి కనీసం రోజులో ఒక గంట అయినా గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం చేయాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవీఎస్ఆర్‌కె మూర్తి, సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం కార్యదర్శి కొండేపూడి శంకరరావు, బిఎంఆర్ బాలికోన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి.సత్యప్రియ పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

కొత్తపల్లి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మండలంలోని ఉప్పాడ శాఖా గ్రంథాలయాంలో లైబ్రరియన్ టి.నళినీప్రియ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. ముగింపు సభలో మండల విద్యాశాఖాధికారి–2 పైడి రాజు మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవడం ఆలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రంలో ఉప్పాడ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పాఠకులు పాల్గొన్నారు.



ఉప్పాడ గ్రంథాలయంలో బహుమతులు పొందిన విద్యార్థులతో అధికారులు



సామర్లకోట గ్రంథాలయంలో బహుమతులు అందజేసిన కమిషనర్, గ్రంథాలయాధికారి తదితరులు



గ్రంథాలయ వారోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి



సమావేశంలో మాట్లాడుతున్న పిఠాపురం ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్ శర్మ